# గ్రామాల అభివృద్ధికి రూ.13.78 కోట్లు

**శెనార్తి మీడియా, ఆదిలాబాద్:**



ఆదిలాబాద్ నియోజకవర్గంలోని గ్రామాల కాలనీల అభివృద్ధి పనుల కోసం ఎస్సీ సబ్ ప్లాన్ కింద రూ.13.78 కోట్లు విడుదలైనట్లు ఎమ్మెల్యే పాయల్ శంకర్ వెల్లడించారు. గ్రామాల నుంచి వచ్చిన వినతుల మేరకు మురికికాలువలు, రోడ్లు, ఇతర అభివృద్ధి పనుల నిమిత్తం ప్రతిపాదనలు పంపగా, ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. దీంతో అభివృద్ధి పనులకు మార్గం సుగమమైందని పేర్కొన్నారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.

# విధులు బహిష్కరించిన న్యాయవాదులు



**శెనార్తి మీడియా, ఆదిలాబాద్:**

ఎన్బీడబ్ల్యూ నోటీసులు ఇవ్వడానికి వెళ్లిన న్యాయవాదులు కౌషిక్ సింగ్, మనోజ్‌లపై నిందితులు దాడి చేసిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఎన్ నగేష్ అన్నారు. న్యాయవాదులపై దాడికి నిరసనగా మంగళవారం విధులను బహిష్కరించి జిల్లా కోర్టు ఎదుట ధర్నా నిర్వహించారు. నిందితులకు ఎవరూ న్యాయ సహాయం చేయవద్దని ఏకగ్రీవంగా తీర్మానించామని తెలిపారు. న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో న్యాయవాదులు కే.ఎం. శ్రీకాంత్, లోక ప్రవీణ్ రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# సహకార శాఖలో నర్సయ్యకు పదోన్నతి



**శెనార్తి మీడియా, ఆదిలాబాద్:**

సహకార శాఖలో ఆదిలాబాద్ జిల్లా డిప్యూటీ రిజిస్టర్, ఆడిట్ అధికారిగా పని చేస్తున్న జే. నర్సయ్యకు స్పెషల్ క్యాడర్ డిప్యూటీ రిజిస్టర్ పదోన్నతి లభించింది. నిర్మల్ జిల్లా సహకార అధికారిగా ఆయన నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీయో ఎంఎస్ నంబర్ 129 అగ్రికల్చర్ అండ్ కోఆపరేషన్ ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. నవీన్ కుమార్, కార్యాలయ సిబ్బంది నర్సయ్యను శాలువాతో సత్కరించి పూల బొకే అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి జి. మోహన్, పర్యవేక్షకులు ముజఫర్ హుస్సేన్, ఆత్మరామ్, శారదతో పాటు ఉద్యోగులు లక్ష్మి, నయీమ్, నరేష్, సంజయ్, కృష్ణారెడ్డి, దినేష్, తౌఫిక్, అప్రేష్, ఆశాజ్యోతి, కృష్ణవేణి పాల్గొన్నారు.

# కలెక్టర్, ఎస్పీకి సనాతన సమితి సత్కారం



**శెనార్తి మీడియా, ఆదిలాబాద్:**

ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా గణేష్ నవరాత్రులను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం చేసిన కృషి ప్రశంసనీయం అని సనాతన హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌ను సమితి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. నవరాత్రుల సమయంలో ఏవైనా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు, పోలీసు బలగాలను సమర్థవంతంగా వినియోగించి శాంతి భద్రతలను కాపాడిన విధానం అభినందనీయమని తెలిపారు.అదేవిధంగా సమితి ప్రతినిధులు ఏఎస్పీ సురేందర్ రావును శాలువాతో సత్కరించి పూల బొకే అందజేశారు. అధికారులు సమాజంలోని అన్ని వర్గాలతో సమన్వయం కలిగి, పండుగను విజయవంతం చేయడంలో చూపిన కృషి గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు.ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, ప్రధాన కార్యదర్శి పడకంటి సూర్యకాంత్, కోశాధికారి రేణుకుంట రవీందర్, నిర్వాహక కార్యదర్శి కందుల రవీందర్, ప్రేమ్ సింగ్, మహిపాల్, జిన్నావర్ రాజు, బానోత్ కృష్ణ కుమార్ పాల్గొన్నారు.







# వైద్యం అందించాలంటే సాహసమే

## వాగులు, వంకలు దాటి గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు



**శెనార్తి మీడియా,ఆదిలాబాద్ :**

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని బొప్పాపూర్, అసోద గ్రామాల్లో వైద్య సేవలు అందించేందుకు అంకోలి పిహెచ్సీ వైద్య సిబ్బంది సాహసయాత్ర చేపట్టారు. రోడ్డు సౌ కర్యం లేకపోవడంతో వాగులు, వంకలను దాటి గ్రామాలకు చేరుకొని గిరిజనులకు వై ద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వరాలు, జలుబు, ఒళ్ళు నొప్పులతో బాధపడుతున్న 32 మందిని పరీక్షించి మందులు అందజేశారు. ఈ శిబిరంలో డాక్టర్ మనోహర్, డాక్టర్ సర్వరాజ్, సిబ్బంది శకుంతల, సాయి, అరుణ్, సుష్మ, అనిల్ పాల్గొన్నారు.

# తెలంగాణ భాషకు విశిష్టత



**శెనార్తి మీడియా, ఆదిలాబాద్:**

తెలంగాణ భాషకు విశిష్టమైన ప్రాధాన్యం ఉందని ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అథిక్ బేగం అన్నారు. మంగళవారం కాళోజి జయంతి సందర్భంగా కాళోజి చిత్రపటానికి పూలమాలలు అర్పించి నివాళులు అర్పించారు. అనంతరం తెలంగాణ భాష ప్రాముఖ్యతను, ప్రజల జీవన విధానంలో దాని స్థానం గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రఘు గణపతి, అధ్యాపకులు రేఖ, యాకుబ్ అలీ, పృథ్వీ, చంద్రకాంత్, స్వప్న, అనిత, కృనాల్, నరేష్ పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం

**శెనార్తి మీడియా, ఆదిలాబాద్:**

ఆదిలాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్‌లో తెలంగాణ భాషా దినోత్సవం, కాళోజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాళోజీ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జె. సంగీత మాట్లాడుతూ తెలంగాణ భాష పలుకుబడుల భాష అని, దానిలో తెలంగాణ ఆత్మ ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. మన భాషను మనమే గౌరవించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు రడాపు సంతోష్ కుమార్, అధ్యాపకులు చక్రవర్తి, జ్యోత్స్న, మంజుల, శ్రావణ్ , ఆనందం, రాజ్ కుమార్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.






# సీసీఐ ప్రారంభం చేతల్లో చూపాలి

**శెనార్తి మీడియా, ఆదిలాబాద్:**

ఆదిలాబాద్ జిల్లాలో సీసీఐ సిమెంట్ ఫ్యాక్టరీ ప్రారంభంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడాన్ని స్వాగతిస్తున్నామని సీసీఐ సాధన కమిటీ కన్వీనర్ దర్శనాల మల్లేష్ తెలిపారు.మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, పేపర్ ప్రకటనలకే పరిమితం కాకుండా చేతల్లో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీసీఐని ప్రైవేటీకరణ చేస్తే మాత్రం ఊరుకోమని హెచ్చరించారు. సీసీఐ ప్రారంభమైతే అనేక ఉపాధి అవకాశాలు కలుగుతాయని, ఆలస్యం లేకుండా వెంటనే ప్రారంభించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కో-కన్వీనర్ విజ్జగిరి నారాయణ, రమేష్, బండి దత్తాత్రి, అరుణ్ కుమార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# రిమ్స్‌లో క్యాన్సర్ డే కేర్ సెంటర్ ప్రారంభం



**శెనార్తి మీడియా, ఆదిలాబాద్:**

ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో క్యాన్సర్ బాధితులకు సమగ్ర వైద్యసేవలు అందించేందుకు మంగళవారం క్యాన్సర్ డే కేర్ సెంటర్‌ను ప్రారంభించారు. రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహ అన్ని జిల్లా కేంద్రాల్లో వర్చువల్ విధానంలో ఈ కేంద్రాలను ప్రారంభించగా, స్థానికంగా రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. డైరెక్టర్ మాట్లాడు తూ, ఇప్పటి వరకు క్యాన్సర్ రోగులు కీమోథెరపీ చికిత్స కోసం హైదరాబాద్ వంటి దూరప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేద ని, ఇకపై రిమ్స్‌లోనే ఈ సేవలు అందుబా టులోకి రావడం పెద్ద ఉపశమనమని పేర్కొన్నారు. రిమ్స్‌లో ఏర్పాటు చేసిన డే కేర్ సెంటర్ ద్వారా రోగులు సమయానికి చికిత్స పొందటమే కాకుండా, ఖర్చు, ప్రయాణ ఇబ్బందులను తగ్గించు కోవచ్చని వివరించారు. అంతేకాకుండా, కీమోథెర పీ సేవలు అందుబాటులోకి రావడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చాలా సహాయం అవుతుందని తెలిపారు. వైద్య సిబ్బంది అన్ని వసతులను కల్పించి సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నా రని చెప్పారు. ప్రజలు ఈ సౌకర్యాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని డైరెక్టర్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రిమ్స్ వైద్యులు తొడసం చందు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్‌లో చేరిక

**శెనార్తి మీడియా, ఆదిలాబాద్:**

ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని బొందిడి గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. స్థానిక కాంగ్రెస్ నాయకులు గుగ్లోత్ సునీల్, ఆడే రాంకిషన్, ఆడే రోహిదాస్, ఆడే అరవింద్, జాదవ్ సురేందర్, రాథోడ్ అన్వేష్‌తో పాటు పలువురు నాయకులు పార్టీకి గుడ్‌బై చెప్పి బీఆర్ఎస్‌లో చేరారు. మంగళవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో గులాబీ కండువాలు కప్పుకుని బీఆర్ఎస్ కండువా ధరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వారిని పార్టీలో ఆహ్వానిస్తూ, ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. బీఆర్ఎస్ బలోపేతానికి కొత్తగా చేరిన నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. చేరిన నేతలు మాట్లాడుతూ, "మాటల కాంగ్రెస్ కంటే చేతల బీఆర్ఎస్‌లో ఉంటేనే అభివృద్ధి సాధ్యం. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన బీఆర్ఎస్ పార్టీనే ప్రజల సమస్యలను అర్థం చేసుకొని పరిష్కరిస్తోంది. కష్టాలు తెలిసిన వెంటనే స్పందించే ఎమ్మెల్యే అనిల్ అన్నతో అడుగులు వేయాలని నిర్ణయించుకున్నాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆడే కైలాష్, ఆత్మారం, సాయికుమార్, సుభాష్, ఆడే నరేందర్, గణేష్, ఆడే కరణ్, జాదవ్ నరేందర్, ధర్మ తదితరులు పాల్గొన్నారు.

